క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్ : విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చర్చి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు నెహ్రూనగర్, ఇందిరానగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

వేద గణిత పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థినులు, అధ్యాపకులు

బోడుప్పల్: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో బోయినపల్లి హైటెక్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేద గణిత పోటీల్లో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్కూల్ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నామన్నారు. వేద మాస్టర్ రామారావు, టీచర్లు సాయికుమార్ విద్యార్థినులను అభినందించారు. ప్రిన్సిపాల్ నీలిమా తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలో రూ. 45 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈ వెన్నెల, ఏఈ వినీత్‌రావు, బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

బస్సులో డీజిల్ దొంగతనం !

మేడిపల్లి : నైట్ హాల్ట్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు ట్యాంక్ తాళాలు పగులగొట్టిన దుండగులు డీజిల్‌ను దొంగతనం చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆర్టీసీ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, ప్రతాప్ సింగారం రూట్‌లో ప్రయాణించే ఉప్పల్ డిపోకు చెందిన 4 బస్సులు రోజూ మాదిరిగా ఘట్‌కేసర్ మండలం ప్రతాప్ సింగారంలో నైట్ హాల్ట్ చేస్తాయి. ఎప్పటి లాగానే శనివారం రాత్రి వేళల్లో బస్సులను నిలిపగా.. తిరిగి ఆదివారం తెల్లవారు జామున రెండు బస్సుల డ్రైవర్లు ఉప్పల్ వెళ్లేందుకు బస్సును స్టార్ట్ చేయగా ఇంజిన్ స్టార్ట్ కాకపోవడంతో వెళ్లి చూడగా డీజిల్ ట్యాంకుల తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. సుమారుగా 150 లీటర్ల డీజిల్ దొంగతనానికి గురైందని తెలుసుకున్న ఆర్టీసీ సిబ్బంది మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్ గృహకల్పకు బస్సు ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి బస్సు సర్వీసును కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సహకారంతో బస్సు సౌకర్యం కలిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం నాలుగు ట్రిప్పులు, సాయంత్రం మరో నాలుగు ట్రిప్పులు కాలనీకి బస్సు వస్తుందన్నారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల బలరాం, దేవేందర్, వెంకటేశ్, చలపతి, రాజేందర్, జాఫర్ హుస్సేన్, రాజేందర్ నాయక్, ఐలయ్య, పద్మావతి, రేణుక, బద్రు నాయక్, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో కులసంఘాల భవనాల ప్రారంభం

మేడ్చల్: గిర్మాపూర్‌లో పలు కులసంఘాల భవనాలను ఎమ్మెల్యే మల్లారెడ్డి నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే సొంత నిధులు మంజూరు చేయగా గ్రామ పరిధిలో రజక, ముదిరాజ్ కుల భవనాలు నిర్మించారు. అలాగే గ్రామంలో పునఃనిర్మిస్తున్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు భాస్కర్‌యాదవ్, బాలప్ప, రాజిరెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆటలెట్లా ఆడేది?

- ప్రభుత్వ స్కూళ్లకు ఆట స్థలాలు లేక విద్యార్థుల అవస్థలు
- రోడ్డుపైనే ఆటలు ఆడుతున్న వైనం
- ప్రభుత్వ స్థలాల్ని కేటాయించాలని పలువురి డిమాండ్



రోడ్డుపైనే కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



జిల్లా పరిషత్ హైస్కూల్, రామంతాపూర్

రామంతాపూర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తగినన్ని తరగతి గదులు, ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల మానసిక ఉల్లాసాన్ని క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు దోహదపడే ఆట స్థలాలు కరువయ్యాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు తమలోని క్రీడా ప్రతిభను చాటుకోలేకపోతున్నారు.

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు..

6 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు ఒక జిల్లా పరిషత్ స్కూల్ ఉంది. ప్రతి పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు ఉన్న ఆటల కోసం స్థలాలు లేకపోవడంతో స్పోర్ట్స్ పీరియడ్ వృధాగా పోతుంది. దీంతో ప్రతిఏటా ప్రభుత్వం నిర్వహించే జోనల్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను వెళ్లలేకపోతున్నారు. పాత రామంతాపూర్‌లో ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న 1000 మందికి పైగా విద్యార్థులకు స్థలం సరిపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఆటలు ఆడటంతో కొన్నిసార్లు విద్యార్థులు ప్రమాదాల భారిన పడుతున్నారు.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..

ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ఈ పరిస్థితిపై చొరవ తీసుకుని ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆటస్థలానికి కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కబ్జా స్థలాలను కేటాయించాలి



కబ్జాకు గురవుతున్న చిన్న చెరువు ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా మైదానంగా కేటాయించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– సతీష్, ఆర్టీసీ కాలనీ

అధికారులు స్పందించాలి



రామంతాపూర్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఆట స్థలాలు లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను ఆట స్థలాలుగా మార్చాలి.

– ఎర్రం శ్రీనివాస్



విజేతలతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సందడిగా రంగోలి పోటీలు

మల్లాపూర్: నాచారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నాచారం రాఘవేంద్రనగర్‌లో రంగోలీ పోటీలు కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతిసాయిజెన్‌శేఖర్, బొంతు శ్రీదేవి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్ పటేల్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న, నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తిప్పరి రాజబాబు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి సాయిరాం పాల్గొన్నారు.

సీఎం పరామర్శ



నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: ఇటీవల మృతి చెందిన పారిశ్రామికవేత్త మన్నె సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం చర్లపల్లి శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో పెద్దకర్మ నిర్వహించగా.. సుబ్రహ్మణ్యం చిత్రపటానికి సీఎం నివాళులర్పించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, బీఆర్ఎస్ నేత సోమశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, విఠల్ నాయక్, వజ్రేష్‌యాదవ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరణలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బండా ప్రకాష్

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలో వీరశైవ లింగాయత్ నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్పొరేటర్లు ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్లు రామారావు, ధన్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పావనీరెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ..

అల్వాల్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టప్రా) అల్వాల్ ఏరియా కమిటీ సమావేశం ఆదివారం అల్వాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టప్రా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడుచెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి బాలగంగాధర్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈనెల 8 న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈపీఎఫ్ పెన్షనర్ల జాతీయ పోరాట సమన్వయ సమితి సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. టప్రా ఆధ్వర్యంలో కేలండర్ డైరీని ఆవిష్కరించారు.

మల్లాపూర్: సోమవంశ సహస్ర అర్జున క్షత్రియ సమాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ గౌడ సంక్షేమ సంఘం నూతన కేలండర్‌ను కౌడిన్య గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల కేశవనాథం గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బొడిగే ఉదయ్‌గౌడ్‌సంఘం ప్రధాన కార్యదర్శి నాగభూషణంగౌడ్, సభ్యులు బత్తుల సత్యనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, చంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో..

అల్వాల్: మచ్చబొల్లారంలోని నల్ల పోచమ్మ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను సురేష్ సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్, బీఆర్ఎస్ నేతలు నర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. జితేందర్, రవి, దశరథ్, రవీందర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, దుర్గేష్, వెంకటేష్, ప్రవీణ్‌లాల్, అంజిరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంఘం..

మౌలాలి : మల్కాజిగిరి మండలం ముదిరాజ్ కేలండర్ ఆవిష్కరణలో రాష్ట్ర అధ్యక్షుడు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాష్ పాల్గొన్నారు. చెరుకు సాంబరాజు, ప్రముఖ సలహాదారుడు వంశీ, దండు ప్రసాద్‌బాబు, యాదగిరి, భిక్షపతి, రవి, భూమయ్య, రంజిత్, అరుణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విమల నీలం శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన, వినాయకకౌతం, బాలకనకమయ, లలితా నీరాజనం, జనుత శబ్ద, లక్ష్మీఅష్టకం ప్రదర్శించారు. నాట్య గురువులు ప్రసన్నరాణి, నభట్ లాఖని, డాక్టర్ రజని మల్లాది నిహారికరెడ్డి కళాకారులను అభినందించారు.

చర్లపల్లి టర్మినల్ ఏర్పాట్ల పరిశీలన

కుషాయిగూడ: దాదాపు రూ.413 కోట్లతో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను కేంద్రం ఆధునీకరించింది. ఈ రైల్వే టర్మినల్‌ను నేడు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఆదివారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్. ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలించారు.

రూ.78 లక్షలతో అభివృద్ధి పనులు

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యనిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 23వ డివిజన్ పరిధిలో రూ.78 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కు ప్రహరీ నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశలవారీగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యనిస్తున్నట్లు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజలు సకాలంలో అన్ని రకాల పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, నేతలు దానగల్ల యాదగిరి పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి : గీతానగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు, మోడ్రన్ జిమ్ ఏర్పాటుకు బల్దియా అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్నారు. త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బల్దియా డీఈ మహేష్, మౌలాలి ఏఈ మధురిమలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, నిధులు మంజూరు చేయించాలని ఆదేశించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వాహనదారులతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి

ఉప్పల్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి అన్నారు. ఆదివారం ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్లను తనిఖీ చేసి సీటుబెల్టు పెట్టుకోవాలని వాహనదారులకు చెప్పి పంపించి వేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3.10 కోట్ల అభివృద్ధి పనులకు మేయర్ అమర్‌సింగ్ శంకుస్థాపన చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్లలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ సాయినాథ్‌గౌడ్, నాయకులు దర్గ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ ప్రతినిధులు

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ ఆదివారం మేయర్ అజయ్‌యాదవ్, కార్పొరేటర్ వెంకటేష్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్ల క్రితం వాటర్ పైపులైన్లు వేశారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో లీకేజీలు, పగిలిపోతున్నాయని వాపోతున్నారు. పాత వాటిని తొలగించి కొత్తవాటిని వేయాలని కోరారు. వీధినంబరు 6లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఖాళీ ప్లాట్లలో చెత్త, చెదారంతో అపరిశుభ్రత ఏర్పడుతుందని, నివారణకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు కిశోర్‌కుమార్, కోశాధికారి సాయిగణేష్, ప్రతినిధులు కోటేశ్వరరావు, సహోదర్‌రెడ్డి, రామకృష్ణ, నిఖిల్‌మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

చికిత్స పొందుతూ ఒకరు మృతి
మరొకరికి గాయాలు



లోకేష్ (ఫైల్)

కుషాయిగూడ: అదుపుతప్పి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు కరెంటు పోల్‌ను ఢీకొట్టిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, బీవండి, తానేకు చెందిన లోకేష్ బీకాష్ విశ్వకర్మ (24) కొంతకాలం క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. రాధిక చౌరస్తాలోని యూకో బ్యాంకు వద్ద ఓ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని స్నేహితుడు ఈకేందర్‌తో కలిసి బైక్‌పై సైనిక్‌పురి వైపుగా వెళ్తుండగా.. ఫాలోమీ ఆసుపత్రి సమీపం వద్ద బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లోకేష్ తలకు తీవ్రగాయం కాగా.. ఈకేందర్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లోకేష్ ఆదివారం సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకన్న తెలిపారు.

మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

- రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు
- నెరవేరనున్న 40 ఏళ్ల కల



మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ఆవరణలో చదును చేస్తూ..



గౌతంనగర్: మల్కాజిగిరి రైల్వేస్టేషన్ మోడల్ స్టేషన్‌గా మారనుంది. ప్రయాణికులకు 40 ఏళ్ల కల సాకారం కానుంది. గతంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో భాగంగా మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రయాణికులకు కొత్తగా అదనపు సేవలు అందించడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు సుమారు రూ.27 కోట్లతో చేపడుతున్న పనులు వేగంగా సాగుతున్నాయి.

రాష్ట్రంలో 12 రైల్వేస్టేషన్లు..

రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. అందులో మల్కాజిగిరి రైల్వేస్టేషన్ మొదటి వరుసలో ఉంది.

ఎస్కలేటర్లు.. వేయిటింగ్ హాల్స్..

గతేడాది ఆగస్టు 6న ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అభివద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ భవనాన్ని విస్తరిస్తున్నారు. మూడు ఎస్కలేటర్లు, మూడు లిఫ్టులు, ప్రస్తుతం ఉన్న మూడు ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి పైకప్పు, మనీషా గార్డెన్స్ నుంచి సూర్య టవర్స్ వరకు 60 అడుగుల విస్తరణతో రోడ్డు, అదనంగా రిజర్వేషన్ కౌంటర్లు, వీఐపీ లాంజ్, ఆర్పీఎఫ్ కార్యాలయం, మినీరెస్టారెంట్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కాచిగూడలో ఉన్న సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయాన్ని మల్కాజిగిరిలో ఏర్పాటు చేస్తున్నారు.

4 దశాబ్దాల కల సాకారం...

40 ఏళ్లుగా ఎదురు చూస్తున్న మల్కాజిగిరి వాసుల కల నెరవేరనుంది. ఈ స్టేషన్‌తో పాటు సమీపంలోని దయానంద్‌నగర్, సఫిల్‌గూడ రైల్వేస్టేషన్‌లో అభివద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌తో పాటు ఆదిలాబాద్, బాసర, మేడ్చల్, బొల్లారం, అల్వాల్‌తో పాటు ఫలక్‌నుమా, షిర్డీ, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు.